నమస్తే తెలంగాణ
పెద్దపల్లి
5 | కరీంనగర్, ఆదివారం 29 సెప్టెంబర్ 2024 | PEDDAPALLI

కరీంనగర్ కలెక్టరేట్ ఎదుట నిరసన తెలుపుతున్న ఉపాధ్యాయులు

జీవో నంబర్ 25 సవరించాలి

కలెక్టరేట్ ఎదుట యూఎస్‌పీసీ నాయకుల నిరసన

కమాన్‌చౌరస్తా, సెప్టెంబర్ 28 : జీవో నంబర్ 25 సవరణ చేసిన తర్వాతే ఉపాధ్యాయుల సర్దుబాటు చేయాలని యూఎస్‌పీసీ నాయకులు డిమాండ్ చేశారు. ఈ మేరకు శనివారం కలెక్టరేట్ ఎదుట నిరసన తెలిపారు. ఈ సందర్భంగా సంఘం రాష్ట్ర బాధ్యుడు వీ రాజిరెడ్డి మాట్లాడారు. జీవో నంబర్ 25లో అనేక లోపాలు ఉన్నాయని చెప్పారు. పాఠశాలల సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఇక్కడ రాష్ట్ర బాధ్యుడు మాడుగుల రాములు, జీ ఎల్లయ్య, చంద్రమౌళి, బాలయ్య, ముల్కల కుమార్, పోరెడ్డి దామోదర్ రెడ్డి, ఆవాల నరహరి, జావేద్, ఆర్ చంద్రశేఖర్‌రావు ఉన్నారు. అనంతరం, డిప్యూటీ తహసీల్దార్ ఎన్ కిషన్‌కు వినతి పత్రం అందజేశారు.

సిరిసిల్ల ఆర్డీవో కార్యాలయం ఎదుట నిరసన తెలుపుతున్న పాత రేషన్ డీలర్లు

మా ఉపాధి దెబ్బ తీయద్దు

సిరిసిల్ల కలెక్టరేట్, సెప్టెంబర్ 28 : సిరిసిల్లలో తాము గత ఐదేళ్ల నుంచి రేషన్ దుకాణాలు నిర్వహిస్తూ ఉపాధి పొందుతున్నామని, తమ కుటుంబాలు రోడ్డున పడకుండా కాపాడాలని, తమ ఉపాధి దెబ్బతీయద్దని ఆర్డీవో రమేశ్‌కు పాత రేషన్ డీలర్లు మొరపెట్టుకున్నారు. ఈ మేరకు శనివారం సిరిసిల్ల ఆర్డీవో కార్యాలయం వద్దకు వచ్చి నిరసన తెలిపారు. అనంతరం వారు మాట్లాడుతూ.. 2013 నుంచి 2020 వరకు సిరిసిల్ల డివిజన్‌లోని వివిధ మండలాల్లో పునర్విభజన, వివిధ కారణాల వల్ల ఏర్పడిన కొత్త రేషన్ షాపులకు దరఖాస్తు చేసుకోగా గత ప్రభుత్వం తమకు ఉపాధి కోసం ఇచ్చిందన్నారు. రేషన్ దుకాణాలు నడుపుతూ వచ్చే కమీషన్ డబ్బులతో ఉపాధి పొందుతున్నామని తెలిపారు. ఇటీవల నిర్వహించిన డీలర్ల నియామకంలో సరైన క్యాస్ట్ వైజ్ రోస్టర్ విధానం ప్రకారం జరగనందున సరైన పద్ధతిలో సెలక్షన్స్ నిర్వహించాలని కోరారు. ఇక్కడ ఎన్ శైలజ, పీ లత, ఎం లక్ష్మి, బీ పద్మ, టీ కావేరి, ఎస్ రేఖ, పీ లత, పీ రచన ఉన్నారు.

₹2కోట్లకు వ్యాపారి ఐపీ

వేములవాడ, సెప్టెంబర్ 28 : వేములవాడ పట్టణంలోని ఓ వ్యాపారి ₹2కోట్లకు ఐపీ పెట్టడంతో అప్పు ఇచ్చిన స్నేహితులు, బంధువులు ఆందోళన పడ్డారు. చందుర్తి మండలంలోని ఓ గ్రామానికి చెందిన వ్యాపారి పదేండ్ల క్రితం వేములవాడకు వచ్చాడు. ముందుగా దుగోడ మిషన్‌తో ప్రారంభమై.. తర్వాత ఫ్లైఉడ్ సెంటర్ వ్యాపారంలోకి అడుగుపెట్టాడు. సదరు వ్యాపారి నెలరోజుల నుంచి కనిపించడం లేదు. అయితే ఇండ్లు, భూములు కొనుగోలు, అమ్మకాలు జరిపిన ఆశించిన లాభాలు రాకపోవడంతో వడ్డీలు పెరిగిపోయి ₹కోటి 36లక్షలు బాకీ ఉన్నట్టు శనివారం ఐపీ దాఖలు చేశాడు. సదరు వ్యాపారి 30 మందికి ఐపీ నోటీసులు పంపడం పట్టణంలో చర్చనీయాంశంగా మారింది.

మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే డాక్టర్ రసమయి బాలకిషన్

రాంలీలా పేరిట 'కవ్వంపల్లి' అక్రమ వసూళ్లు

- రాంలీలాకు ఎమ్మెల్యే, కాంగ్రెస్‌కు సంబంధం ఏంటి?
- అధికారులు, నాయకులకు రూ.కోటి టార్గెట్ పెట్టింది నిజం కాదా?
- షాడో వసూళ్ల సంగతి తేలుస్తా
- వసూళ్లు ఆపకపోతే సీఎం, డీజీపీకి ఫిర్యాదు చేస్తా
- మాజీ ఎమ్మెల్యే రసమయి ధ్వజం
- సీపీ దృష్టి సారించాలని వినతి

తిమ్మాపూర్, సెప్టెంబర్ 28 : రాంలీలా పేరిట ఎమ్మెల్యే కవ్వంపల్లి సత్యనారాయణ ఆయన అంతరంగికుడితో అక్రమ వసూళ్లకు పాల్పడుతున్నాడని మాజీ ఎమ్మెల్యే డాక్టర్ రసమయి బాలకిషన్ ఆరోపించారు. వసూళ్లు ఆపకపోతే ఎల్ఎండీలోని అమరవీరుల స్తూపం నుంచి ట్యాంక్‌బండ్ అమరవీరుల స్తూపం వరకు వెయ్యి మందితో పాదయాత్ర చేసి, బండారం బయట పెడుతానని హెచ్చరించారు. తిమ్మాపూర్ మండల కేంద్రంలోని బీఆర్ఎస్ రాష్ట్ర నాయకుడు కేతిరెడ్డి దేవేందర్‌రెడ్డి గెస్ట్‌హౌస్‌లో శనివారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. అసలు రాంలీలాకు, ఎమ్మెల్యేకు సంబంధం ఏంటని ప్రశ్నించారు. మహాత్మానగర్ గ్రామ కమిటీ ఆధ్వర్యంలో ఎన్నో ఏండ్లుగా నిర్వహిస్తున్న రాంలీలా వేడుకలను తాను ఎమ్మెల్యేగా గెలిచిన తర్వాత ఎనిమిదేండ్లుగా కళాకారుల ఆటాపాటలతో నిర్వహించామని, దసరా రోజు వేల కుటుంబాలు ఆనందంగా వీక్షించాయని గుర్తు చేశారు. తామెక్కడ కమిటీ వేసి వేడుకలు నిర్వహిస్తామోనని ముందుగానే కేవలం కాంగ్రెస్ కార్యకర్తలనే కమిటీలో వేసి పోస్టర్ రిలీజ్ చేశారని దుయ్యబట్టారు. తాను వేడుకలు నిర్వహించినప్పుడు అన్ని పార్టీల నాయకులకు అవకాశం కల్పించానని, ఎవరినీ ఒక్క రూపాయి అడగలేదని, సొంతంగా నిర్వహించానని స్పష్టం చేశారు. తాము, తమ నాయకులు కమిటీలో ఉంటే వసూళ్లకు సాధ్యం కాదనే ఆయన అనుచరగణంతో కమిటీ వేసి టార్గెట్ పెట్టారన్నారు. తిమ్మాపూర్ జడ్పీటీసీగా ఉన్న సమయంలో ఒక్కసారి కూడా రాని కవ్వంపల్లి.. నేడు అందిన కాడికి దోచుకునేందుకే వస్తున్నాడని ఆరోపించారు. సంస్కృతీ సంప్రదాయాలు ఉట్టిపడేలా నిర్వహించిన రాంలీలా వేడుకలకు అవినీతి మరకలు అంటించవద్దని హితవు పలికారు. వేడుకలు నిర్వహించడం చేతకాకపోతే తప్పుకోవాలని, మాజీ ఎమ్మెల్యేగా తాను, ఎమ్మెల్యేగా ఆయన చెరో ₹5 లక్షలు కమిటీకి ఇచ్చి వేడుకలు జరిపిద్దామని సవాల్ విసిరారు. తాను ఎమ్మెల్యేగా ఉన్న పదేండ్లలో ఇంటింటికీ వెళ్లి సీఎంఆర్ఎఫ్, కల్యాణలక్ష్మి చెక్కులు ఇస్తే.. 'ఇది కాదు అభివృద్ధి అంటే' అని విమర్శించిన కవ్వంపల్లి.. ఇప్పుడు 'ఆయన చేస్తున్న వసూళ్లేనా..? అభివృద్ధి అంటే' అని ధ్వజమెత్తారు. ఇప్పటి వరకు ఒక్క రోడ్డు, కులసంఘ భవనం నిర్మించలేదని, తాను నిధులు ఇచ్చినవే ప్రారంభించుకుంటూ వెళ్తున్నాడని ఎద్దేవా చేశారు.

షాడో వసూళ్లు తేలుస్తా..

కవ్వంపల్లికి అంతరంగికుడైన షాడో ఎమ్మెల్యే మురళీధర్‌రెడ్డి చేస్తున్న అరాచకాలు ఎమ్మెల్యేకు తెలిసే జరుగుతున్నాయా..? అని రసమయి సూటిగా ప్రశ్నించారు. ఎమ్మెల్యే, ఆయన అంతరంగికుడు ఎవరెవరిని డబ్బులు అడుగుతున్నారో తన వద్ద అన్ని సాక్ష్యాలున్నాయని, ఆధారాలతోనే మాట్లాడుతున్నానని, ఆ వసూళ్ల సంగతి తేలుస్తానని స్పష్టం చేశారు. ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో ప్రైవేటు వ్యక్తుల వసూళ్ల దందా.. ఏంటని నిలదీశారు. ఆయన బాధితుల్లో కాంగ్రెస్ నాయకులు సైతం ఉన్నారన్నారు. ఆయన పెట్టించే వెకిలి పోస్టులపై చట్టపరమైన చర్యలకు వెనుకాడబోనని స్పష్టం చేశారు.

అబద్ధమైతే ముక్కు నేలకు రాస్తా..

ఎమ్మెల్యే గెలుపు కోసం కష్టపడి పని చేసిన నాయకుడు కాల్వ మల్లేశం వద్దే వసూళ్లు చేసిన కవ్వంపల్లికి రాంలీలా పేరిట వసూలు చేసుకోవడం కష్టమైన పని కాదని రసమయి సెటైర్లు వేశారు. రియల్ ఎస్టేట్ చేసుకుంటున్న వారిని కూడా పీడిస్తున్న విషయం వాస్తవం కాదా..? గన్నేరువరం డబుల్ రోడ్డు కాంట్రాక్టర్‌కు బిల్లులు ఇప్పిస్తానని వసూళ్లు చేసి మోసం చేసింది వాస్తవం కాదా..? అని ప్రశ్నించారు. తాను ఎమ్మెల్యేగా ఉన్నప్పుడు ఇల్లంతకుంటలో అంబేద్కర్ కాంస్య విగ్రహం ఏర్పాటు చేస్తే, దానిని ప్రారంభించి దళితసంఘ నాయకులకు ఖర్చులకు ఇస్తానన్న ₹20 వేలు ఇవ్వని కవ్వంపల్లి.. రాంలీలాకు సొంతంగా ఖర్చు పెడుతాడా..? అని నిలదీశారు. అధికారులు, ప్రజాప్రతినిధులకు ₹కోటి టార్గెట్ పెట్టింది నిజం కాదా..? ప్రశ్నించారు. ఎప్పుడు ఎలాంటి వసూళ్లు అడుగుతారోనని అధికారులు, కార్యకర్తలు బెంబేలెత్తుతున్నారన్నారు. తాను చెప్పినవి అబద్ధమైతే ముక్కు నేలకు రాస్తానని స్పష్టం చేశారు.

సీఎంకు ఫిర్యాదు చేస్తా

ఎమ్మెల్యే వసూళ్లన్నీ ఇబ్రహీంపట్నంలో మెడికల్ కాలేజీ ఏర్పాటు కోసమేనని రసమయి ఆరోపించారు. కాలేజీకి ₹300కోట్లు అవసరమని, ఇప్పటికే ₹వంద కోట్లు వచ్చాయని.. మరో ₹200 కోట్ల కోసం నియోజకవర్గ ప్రజలు ఎంత ఇబ్బంది పడుతారోనని ఆందోళన వ్యక్తం చేశారు. అందుకే ఆయన షాడో ద్వారా రేషన్ బియ్యం అమ్ముకునే వారి నుంచి రియల్, కాంట్రాక్టర్లు, ఇసుక ట్రాక్టర్లు ఇలా ఎవరినీ వదలడం లేదని విమర్శించారు. ఆయన చేస్తున్న చిల్లర రాజకీయాలు, దందాలపై సోషల్ మీడియాలో ప్రశ్నించిన సుదగోని సదిగౌడ్, నాగరాజుతోపాటు మరెందరో యువకుల మీద కేసులు బనాయించారని మండిపడ్డారు. వసూళ్లు ఆపకపోతే డీజీపీ, ముఖ్యమంత్రికి, డీజీపీ ఫిర్యాదు చేస్తానని స్పష్టం చేశారు. ఎమ్మెల్యే వసూళ్లపై కరీంనగర్ సీపీ దృష్టిసారించాలని కోరారు. సమావేశంలో బీఆర్ఎస్ మండలాధ్యక్షుడు రావుల రమేశ్, రాష్ట్ర నాయకులు కేతిరెడ్డి దేవేందర్‌రెడ్డి, ఇనుకొండ జితేందర్‌రెడ్డి, పోరండ్ల సొసైటీ చైర్మన్ సింగిరెడ్డి స్వామిరెడ్డి, నాయకులు బోయిని కొమురయ్య, మాతంగి లక్ష్మణ్, పాశం అశోక్‌రెడ్డి, పొన్నం అనిల్, వడ్లూరి శంకర్, పొన్నాల సంపత్ పాల్గొన్నారు.

డీ సెట్-24 అభ్యర్థులకు మరో అవకాశం

తిమ్మాపూర్‌రూరల్, సెప్టెంబర్ 28 : డీ సెట్-2024 అభ్యర్థుల ఒరిజినల్ ధ్రువపత్రాల పరిశీలనకు మరో అవకాశం కల్పిస్తున్నట్లు ఎల్ఎండీకాలనీలోని జిల్లా విద్యా శిక్షణ సంస్థ ప్రిన్సిపాల్ శ్రీరాం మొండయ్య తెలిపారు. డిప్లొమా ఇన్ ఎలిమెంటరీ ఎడ్యుకేషన్, డిప్లొమా ఇన్ ప్రీస్కూల్ ఎడ్యుకేషన్ మొదటి సంవత్సరం 2024-25లో చేరేందుకు నిర్వహించిన డీ-సెట్ 24లో ఉత్తీర్ణులై ధ్రువపత్రాల పరిశీలన చేయించుకోని ఉమ్మడి కరీంనగర్ జిల్లా అభ్యర్థులు వచ్చే నెల 1న ఉదయం 10 నుంచి సాయంత్రం 5 గంటల మధ్య ఒరిజినల్ ధ్రువపత్రాల పరిశీలన కోసం ఎల్ఎండీ కాలనీలోని జిల్లా విద్యా శిక్షణ సంస్థకు రావాలని సూచించారు.

నేడే ఆర్టీసీ ఎలక్ట్రికల్ బస్సులు ప్రారంభం

తెలంగాణచౌక్, సెప్టెంబర్ 28 : ఆదివారం ఉదయం 9 గంటలకు నగరంలోని డాక్టర్ బీఆర్ అంబేద్కర్ స్టేడియంలో రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్, ఆర్టీసీ ఎండీ, వైస్ చైర్మన్ సజ్జనార్ ఎలక్ట్రికల్ బస్సులను ప్రారంభించనున్నారు. 35 ఎలక్ట్రికల్ సూపర్ లగ్జరీ బస్సులతో పాటు 6 డీలక్స్ బస్సులను ప్రారంభించనుండగా, అధికారులు ఏర్పాట్లు చేశారు. కరీంనగర్ డిపో-2 కేంద్రంగా ఈ బస్సులను పర్యవేక్షించేందుకు జై భారత్ మారుతి సంస్థ తన సిబ్బందిని నియమించింది. ప్రారంభోత్సవంలో స్థానిక ఎంపీ, కేంద్రహోంశాఖ సహాయ మంత్రి బండిసంజయ్‌కుమార్, ఎమెల్యే గంగుల కమలాకర్ పాల్గొననున్నారు.

రైస్‌మిల్లర్స్ అసోసియేషన్ నుంచి
అధికారులకు భారీ ముడుపులు?
మిల్లర్ల గొడవతో బయటకు వస్తున్న బాగోతం

రైస్‌మిల్లర్స్ అసోసియేషన్ నుంచి కొంత మంది ఉన్నతాధికారులకు భారీ ముడుపులు అందుతున్నాయా..? అందుకే కొంతమంది ఎన్ని తప్పులు చేసినా ఉపేక్షిస్తున్నారా..? సీఎంఆర్ ధాన్యాన్ని తెగ నమ్ముకున్నా చర్యలు తీసుకోవడానికి వెనుకంజ వేస్తున్నారా..? మామూళ్లకు అలవాటు పడిన అధికారులు అక్రమార్కులను వదిలేస్తూ ప్రభుత్వ లక్ష్యాలకు తూట్లు పొడుస్తున్నారా..? రా రైస్ పేరిట రేషన్ బియ్యాన్ని సివిల్ సప్లైకి పెట్టినా అండగా నిలుస్తున్నారా..? ఈ వ్యవహారం వల్ల నీతి, నిజాయితీగా మిల్లులు నడుపుతున్న యజమానులు ఇబ్బందులకు లోనవుతున్నారా..? అసోసియేషన్‌తో పాటు అధికారులకు ముడుపులు చెల్లించలేక మానసిక వ్యథను అనుభవిస్తున్నారా..? అంటే అవుననే సమాధానమే వస్తున్నది. అక్రమార్కులకు అధికారులు వంత పాడడానికి ప్రధాన కారణం భారీగా ముడుపులు ముట్టడమే కారణమన్నది ఇటీవల మిల్లర్లలో జరుగుతున్న గొడవల వల్ల బయటకు వస్తున్నది. అయితే అసోసియేషన్ చూపుతున్నట్టు సదరు అధికారులకు అంత పెద్ద మొత్తంలో లంచాలు ఇచ్చారా..? లేదా..? అన్నదానిపై వచ్చే సమావేశాల్లో నిలదీసేందుకు పలువురు మిల్లర్లు సిద్ధమవుతుండగా.. తాజాగా బయటకు వచ్చిన ముడుపుల వ్యవహారం, అలాగే ఈసీ సమావేశం జరిగిన తీరు ప్రస్తుతం మిల్లర్లలో హాట్‌టాపిక్‌గా మారింది.



- తవ్వినా కొద్దీ బయటకు వస్తున్న అక్రమాలు
- ఓ ఉన్నతాధికారికి ₹15 లక్షల లంచం ఇచ్చినట్లుగా రికార్డులు?
- డీఎం, డీఎస్‌వో స్థాయి అధికారులకు భారీ నజరానాలు
- ఇవి చాలవన్నట్టు బెడ్‌కు ₹18వేల చొప్పున వసూలు
- అసోసియేషన్ గ్రీన్‌సిగ్నల్ ఇస్తేనే అనుమతులు
- అంత పెద్దమొత్తంలో లంచాలపై ఆగ్రహిస్తున్న కొంత మంది మిల్లర్లు
- ఎందుకిచ్చారని ప్రశ్నించేందుకు సిద్ధం

వసూళ్ల పర్వం

అసోసియేషన్ నుంచి బయటకు వస్తున్న సమాచారం ప్రకారం.. లక్షల్లో ముడుపులు తీసుకుంటున్న అధికారులు.. అవి చాలవన్నట్టు మిల్లర్ల అవసరాలను ఆసరాగా చేసుకొని భారీగా వసూళ్లకు పాల్పడినట్టు తెలుస్తున్నది. ప్రధానంగా ఎఫ్‌సీఐ గోదాముల్లో బియ్యం దించడానికి కేటాయించే ఒక్కో బెడ్‌కు ₹18వేల చొప్పున వసూలు చేసిన తీరు ప్రస్తుతం వెలుగులోకి వస్తున్నది. ఈ వ్యవహారంలో ముగ్గురు అధికారులు కీలక పాత్ర వహించగా.. దీనికి అసోసియేషన్‌లోని కొంత మంది మద్దతుగా నిలిచారన్న చర్చ మిల్లర్లలో నడుస్తున్నది. ఆరు ఏసీకేలకు ఒక బెడ్ కేటాయిస్తుండగా, ఈ పేరిట సుమారు ₹60లక్షల నుంచి ₹70 లక్షల వరకు వసూలు చేసినట్టు ఆరోపణలు వస్తున్నాయి. బెడ్ కేటాయింపులు కావాలంటే మిల్లర్ ముందుగా ముడుపులు ఇవ్వాల్సిందే. అవి వచ్చినట్టు ధ్రువీకరించుకున్న తర్వాతే బెడ్ కేటాయింపులు, బియ్యం డౌన్‌లోడ్ జరిగాయని ఓ మిల్లర్ వాపోయాడు. నిబంధనల ప్రకారం బియ్యం పెట్టినా ముడుపులు ఎందుకివ్వాలని ఒకరిద్దరు ప్రశ్నిస్తే.. ఇవ్వకపోతే మిల్లు బంద్ చేసుకోవాలని ఓ అధికారి నేరుగా చెప్పాడని తన ఆవేదనను వ్యక్తం చేశాడు. బెడ్ పేరిట వసూలు చేసిన డబ్బుల్లో సదరు ముగ్గురు అధికారులకు ఎంత ముట్టజెప్పారు? అసోసియేషన్‌కు ఎంత మిగిలాయో చెప్పాలని ఇటీవల జరిగిన ఈసీ సమావేశంలో ప్రశ్నించినట్టు తెలుస్తున్నది. ఈ లెక్కల వ్యవహారాన్ని సైతం పూర్తిగా తేల్చి చెప్పాలన్న డిమాండ్ ప్రస్తుతం మిల్లర్ల నుంచి వస్తున్నది. వీటితోపాటు ధాన్యం క్వింటాల్‌కు ₹50 పైసల చొప్పున సుమారు ₹50 లక్షలకు వరకు జరిగిన వసూళ్ల లెక్కలు తేల్చాలని పట్టుబడుతున్నట్లుగా సమాచారం. ఇదిలా ఉంటే తాజాగా ట్రాన్స్‌పోర్ట్ అగ్రిమెంట్ల పేరిట ₹4500 వసూలు చేస్తున్నారని మిల్లర్ల ద్వారా సమాచారం వస్తున్నది. నిజానికి ఈ అగ్రిమెంట్‌కు కేవలం ₹500 మాత్రమే అవుతుందని, దీనిపై సైతం ప్రశ్నించేందుకు పలువురు సిద్ధమవుతున్నట్టు తెలుస్తున్నది.

కరీంనగర్, సెప్టెంబర్ 28 (నమస్తే తెలంగాణ ప్రతినిధి) : రైస్‌మిల్లర్స్ అసోసియేషన్ నుంచి పౌరసరఫరాల శాఖతో సంబంధమున్న అధికారులకు భారీగా ముడుపులు ముడుతున్నట్టు తాజాగా రైస్‌మిల్లర్ల గొడవ ద్వారా వెలుగులోకి వస్తున్నది. ఈ నెల 26న ఎగ్జిక్యూటివ్ కమిటీ (ఈసీ) మీటింగ్‌లో జరిగిన చర్చ, ఈసీ సభ్యులు అడిగిన ప్రశ్నలు, పెద్ద మొత్తంలో డబ్బుల అవకతవకలు వంటి అంశాలపై శనివారం 'నమస్తే తెలంగాణ'లో 'రైస్‌మిల్లర్స్ అసోసియేషన్‌లో ₹2 కోట్ల గోల్‌మాల్?' శీర్షికన ప్రచురించిన కథనం సంచలనం సృష్టించింది. ప్రస్తుతం మిల్లర్లలో ఇదో పెద్ద చర్చనీయాంశం కాగా.. అనేక కోణాలు బయటకు వస్తున్నాయి. నిశితంగా పరిశీలిస్తే ఈసీ సభ్యులు ప్రశ్నించిన సమయంలో అధికారులకు ముడుపులు ఇచ్చిన విషయాన్ని నాయకత్వం వెల్లడించింది. ఈ లెక్కలను చూసి ఈసీ సభ్యుల కళ్లు బైర్లు కమ్మాయని సమాచారం. ప్రధానంగా జిల్లాలో పనిచేసిన ఓ ఉన్నతాధికారికి ఏకంగా ₹15 లక్షలు ఇచ్చినట్టు రికార్డుల్లో చూపెట్టింది. అందులో ఓసారి ₹ఐదు లక్షలు, మరోసారి ₹పది లక్షలు ఇచ్చినట్టు బయట పెట్టింది. సదరు అధికారి చేసిన మిల్లర్లకు చేసిన సహాయం ఏమిటీ? ఎందుకంత పెద్దమొత్తంలో ముడుపులు ఇవ్వాల్సి వచ్చిందో చెప్పాలని సభ్యులు ప్రశ్నించినట్టు అత్యంత విశ్వసనీయ సమాచారం. అంతేకాదు, అంత పెద్ద మొత్తంలో ముడుపులు తీసుకోవడానికి కారణం ఏమిటో..? అవసరమైతే సదరు అధికారి వద్దకే వెళ్లి అడిగేందుకు కూడా కొంత మంది మిల్లర్లు సిద్ధమైనట్టు తెలుస్తున్నది. అలాగే డీఎం, డీఎస్‌వో స్థాయి అధికారులకు ₹పది లక్షల చొప్పున ఇచ్చినట్టు లెక్కలు చూపారని సమాచారం. అయితే వీరికి ఇంత పెద్దమొత్తంలో అసోసియేషన్ నుంచి ఎందుకు ఇచ్చారో చెప్పాలని ప్రశ్నించినట్టు తెలుస్తున్నది. నూటికి 95 శాతం మంది యజమానులు నీతిగా, నిజాయితీగా నిబంధనలకు లోబడి మిల్లులు నడుపుతున్నామని, ఎవరో అక్రమాలు చేసే కొంతమందిని కాపాడేందుకు అధికారులకు భారీ మొత్తంలో ముడుపులు ఇచ్చారన్న చర్చ ప్రస్తుతం మిల్లర్లలో నడుస్తున్నది. అక్రమార్కులకు అండగా నిలిచేందుకు అసోసియేషన్ కాదన్న భావన వారిలో వ్యక్తమవుతున్నది. ఒక వేళ ఇవ్వాల్సి వస్తే ఈసీ సమావేశం పెట్టి, చర్చించాలనే నిబంధనలున్నా.. వాటిని పట్టించుకోకుండా ఎలా ఇస్తారని ప్రశ్నించినట్టు తెలుస్తున్నది. అయితే మరోకోణంలో కూడా మిల్లర్లలో చర్చ జరుగుతున్నది. నిజానికి లెక్కల్లో చూపిన విధంగా సదరు అధికారులకు ముడుపులు ముట్టజెప్పారా..? లేదా..? లేక అందులోనూ ఏమైనా గోల్‌మాల్ చేశారా..? మధ్యవర్తిత్వం వహించిన వ్యక్తి అందులో చేతివాటం చూపారా..? అనే అనుమానాలు కూడా వ్యక్తం చేస్తున్నారు. నిజానికి ఇవే కాదు, ఇంకా కొంతమంది అధికారులకు ఇచ్చిన ముడుపుల వ్యవహారం ఇప్పుడిప్పుడే బయటకు వస్తున్నది.

అక్రమార్కులకు అండగా..?

భారీ మొత్తంలో అధికారులకు మామూళ్లు ముడుతుండడం వల్లే అధికారులు కొంత మంది అక్రమార్కులకు అండగా నిలుస్తున్నారన్న అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి.ఒక జిల్లాలో జిల్లాలో రా రైస్ పేరిట కొంత మంది సివిల్ సప్లై గోదాంకు రేషన్ బియ్యాన్ని పంపించారనే విమర్శలు వస్తున్నాయి. దాదాపు 250 నుంచి 350 ఏసీకేల బియ్యాన్ని ఇలా పంపించారని, అందులో పెద్ద మొత్తంలో చేతులు మారాయన్న ఆరోపణలున్నాయి. ఇవేకాదు, మామూళ్లకు ఆశపడుతున్న అధికారులు, రేషన్ బియ్యం సరఫరాలో కొంత మందిపై కేసులు నమోదైనా చర్యలు తీసుకోకుండా వత్తాసు పలుకుతూ.. ప్రభుత్వపరంగా వచ్చే ధాన్యం కేటాయింపులు, బిల్లులు చెల్లింపు వంటి వాటి విషయంలో సదరు అక్రమార్కులకే మొదటి ప్రాధాన్యం ఇస్తున్నారని మిల్లర్లలో చర్చ జరుగుతున్నది. అధికారులు నిబంధనలను తుంగలో తొక్కుతూ అక్రమార్కులకు అండగా నిలుస్తున్నారన్న విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. లంచాలు తీసుకునే అధికారుల ఆశను ఆసరాగా చేసుకొని.. కరీంనగర్ ఉమ్మడి జిల్లాలో కొంత మంది మిల్లర్లు కోట్ల రుపాయాల విలువైన సీఎంఆర్ ధాన్యం విక్రయించి జల్సాలు చేస్తున్నారన్న చర్చ జరుగుతున్నది. అందులోనూ అర కోటికిపైగా విలువైన ధాన్యం అమ్ముకున్న అక్రమార్కులపై కఠిన చర్యలు తీసుకోకపోవడం.. బ్లాక్ లిస్టులో పెట్టకపోవడం వెనుక భారీగా డబ్బులు చేతులు మారడమే అన్న చర్చ ప్రస్తుతం మిల్లర్లలో జరుగుతున్నది.

ఆర్అండ్‌బీలో
సగం ఖాళీ!

- పెద్దపల్లి జిల్లాలో శాఖను వెక్కిరిస్తున్న సిబ్బంది కొరత
- పనుల్లో పర్యవేక్షణ కరువు
- 50 మందికి 26 మందితోనే నిర్వహణ
- నలుగురు డీఈలకు విధుల్లో ఇద్దరే..
- 10 మంది ఏఈలు, ఏఈఈలకు ఉన్నది నలుగురు

పెద్దపల్లి, సెప్టెంబర్ 28 (నమస్తే తెలంగాణ): పెద్దపల్లి జిల్లాలోని ఆర్అండ్‌బీ శాఖను సిబ్బంది కొరత వేధిస్తున్నది. దీంతో రూ.కోట్ల విలువైన రోడ్లు, భవన నిర్మాణాలు, మరమ్మతు పనులపై పర్యవేక్షణ లేక నాణ్యతా ప్రమాణాలు ఉండడం లేదన్న ఆరోపణలు వస్తున్నాయి. జిల్లా కేంద్రంలో ఈఈ ఆఫీస్‌తో పాటు, పెద్దపల్లి భవనాల డివిజన్ కార్యాలయం, పెద్దపల్లి, మంథని, సుల్తానాబాద్‌లో సబ్ డివిజన్లు ఉన్నాయి. ఈ కార్యాలయాల్లో 50 సాంక్షన్ పోస్టులు ఉండగా 26 మంది మాత్రమే పని చేస్తున్నారు. ఒక్కో సబ్ డివిజన్‌కు డిప్యూటీ ఇంజినీర్ ఉండాలి. కానీ, మంథని, పెద్దపల్లికు మాత్రమే డీఈలు ఉండగా, వారికే పెద్దపల్లి, సుల్తానాబాద్ సబ్ డివిజన్‌ల అదనపు బాధ్యతలు అప్పగించారు. 10 ఏఈఈ, ఏఈ పోస్టుల్లో ఇద్దరిద్దరు మాత్రమే ఉన్నారు. ఇద్దరు ఏఈఈల్లో ఒకరు పెద్దపల్లి డివిజన్లో, మరొకరు మంథని డివిజన్లలో పని చేస్తున్నారు. ఇద్దరు ఏఈల్లో ఒకరు రామగుండం, మరొకరు మంథనిలో విధులు నిర్వర్తిస్తున్నారు. ఖాళీలు అధికంగా ఉండడంతో ప్రస్తుత అధికారులపై పని ఒత్తిడి తీవ్రంగా పడుతున్నది. ఫలితంగా పనులపై సరైన పర్యవేక్షణ లేక నాణ్యత లోపిస్తున్నది. సకాలంలో పూర్తికావాల్సిన పనుల్లో జాప్యం జరుగుతోంది. కొత్త పనులకు అంచనాలు రూపొందించడానికి సమయం సరిపోవడం లేదని అధికారులు చెబుతున్నారు. సకాలంలో బిల్లులు కూడా రాక కాంట్రాక్టర్లు ఇబ్బందులు పడుతున్నారు.

పనులపై పర్యవేక్షణా లోపం

ఇంజినీరింగ్ అధికారుల పోస్టులు ఖాళీగా ఉండడంతో పనుల్లో నాణ్యత లోపిస్తున్నది. జిల్లాలోని ఆర్అండ్‌బీ శాఖ పరిధిలో 859 కిలోమీటర్ల రహదారులు ఉన్నాయి. వీటి నిర్మాణం, మరమ్మతులు, పర్యవేక్షణ అంతా క్షేత్ర స్థాయిలో ఇంజినీరింగ్ అధికారులు చేయాలి.ప్రస్తుతం జిల్లాలో ₹కోట్ల విలువైన పనులు జరుగుతున్నాయి. రామగుండంలో సుమారు ₹500 కోట్లతో మెడికల్ కళాశాల, దవాఖాన భవనాల పనులు, పెద్దపల్లి నుంచి కూనారం వెళ్లే రహదారిలో ₹119 కోట్లతో రైల్వే ఓవర్ బ్రిడ్జి, వివిధ వాగులపై వంతెనలు, డబుల్ రోడ్లు, సింగిల్ బీటీ రోడ్ల నిర్మాణాలు జరుగుతున్నాయి. దెబ్బతిన్న రహదారుల మరమ్మతులు, జంగిల్ క్లియరెన్స్ పనులు చేయాల్సి ఉంటుంది. ఆర్అండ్‌బీ శాఖకు చెందిన పనులే కాకుండా పంచాయతీరాజ్ శాఖ పర్యవేక్షణలో జరగాల్సిన పనులను సైతం అప్పుడప్పుడు ఆర్అండ్‌బీ అధికారులకు అప్పగిస్తుంటారు. ప్రభుత్వ పాఠశాలల మరమ్మతు పనుల ను సైతం ఈ శాఖకే అప్పగించారు. దీంతో ఈ పను ల్లో తీవ్ర జాప్యం జరుగుతున్నది.

పనులు వేగంగా చేపడుతున్నాం.

జిల్లాలో రామగుండం మెడికల్ కళాశాల, దవాఖాన నిర్మాణం, పెద్దపల్లిలో కూనారం రైల్వే ఓవర్ బ్రిడ్జి పనులు ప్రధానంగా జరుగుతున్నాయి. వీటికి తోడు మరమ్మతు పనులు, జంగిల్ క్లియరెన్స్ పనులు సైతం వేగంగా చేపడుతున్నాం. పెద్దపల్లి, సుల్తానాబాద్‌లో బైపాస్ రోడ్ల నిర్మాణానికి మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు, ఎమ్మెల్యేలు ఆదేశించారు. ఆ మేరకు అంచనాలను సిద్ధం చేస్తున్నాం. ప్రభుత్వం నుంచి క్లియరెన్స్ రాగానే ప్రారంభిస్తాం. సిబ్బంది కొరత ఉన్నప్పటికీ పనుల్లో పర్యవేక్షణ గానీ, పరిశీలనలో గానీ ఎక్కడా తగ్గకుండానే పనిచేస్తున్నాం.

- భావ్‌సింగ్, ఈఈ, రోడ్లు, భవనాల శాఖ (పెద్దపల్లి)